# మాతృప్రేమ

శ్రీ సుతి తాయి రత్నమాలగారు

జబ్బుతో మంచంమీద పడుకొనివుండికూడా లీలని ముద్దులాడేది అమ్మ అపరిమితంగా. తనచేతుల్లో లీలని పెంచటానికిలేదే అని విచారించేది ఒక్కొక్కప్పుడు.

ఓనాడు లీల తాతగారూ, అమ్మమ్మా లీల తల్లిదగ్గరకూర్చుని మాట్లాడుతున్నారు ఇంకా జబ్బు తగ్గలేదేనని విచారంగా. ఇంతట్లో లీల గంతులువేస్తూ ముద్దుమాటలతో 'అమ్మమ్మా!' అంటూ పరుగెత్తుకొచ్చి వొళ్ళోపడుకుంది.

'ఛీ! పాడుపిల్లా! నీవేనక్షత్రంలో పుట్టావో, మీఅమ్మ అలాజబ్బుతో బాధపడుతోంది. తల్లిని మంచం ఎక్కించావు. దరిద్రపుబిడ్డవు' అంటూ విసుక్కుంది అమ్మమ్మ.

లీల బిక్కమొహంతో లేచి నిలుచుంది.

ఇంతలో లీలఅమ్మ ఒక్కఅదటున మంచంమీద లేచికూర్చుని 'నా బంగారుతల్లీ! రావే! అమ్మా! నిన్నెవరేమన్నారురా?' అని వొళ్ళో కూచోపెట్టుకుని తలనిమురుతూ తల్లివంక రోషారుణనేత్రాలతో చూస్తూ 'అమ్మా! నేను బ్రతికివుండగానే నాతల్లిని అనరానిమాటలంటున్నారే. నాకు జబ్బుచేస్తే అది నాకర్మం. కాని ముక్కుపచ్చలారని నాముద్దుబిడ్డ యిందుకు తరవాది కాదు. ఇంకా దాని అదృష్టంవల్ల నేనింతవరకూ జీవించివున్నాను లేకపోతే ఎప్పుడో ఎగిరిపోయేది ప్రాణం. నాబిడ్డని మీరేమన్నా అంటే నేను సహించలేనమ్మా!' అంది గద్గదస్వరంతో. అమ్మమ్మ అదిరిపోయింది. 'లేదమ్మా! నీమీదగల ప్రేమచేత అలాఅన్నాను. అంతే నాకు ధానిమీద ప్రేమలేకనా?' అంది మెల్లిగా.

'నువ్వు నూరుచెప్పు వెయ్యిచెప్పు నామీదగలప్రేమలో సగమైనా నా బిడ్డపైన నీకు వుండదు. అబ్బా! నాచిట్టితల్లి నెంతమాటన్నారు. నాలీలకోరకు నేను తప్పకబ్రతికివుండాల్సిందే. లేకపోతే మాఅమ్మ కెన్నికష్టాలో' అని కంటతడి పెట్టి తన బాహులతలో లీలని ప్రేమాలింగనముచేసికుని చిన్ని చెక్కుటద్దాలు వేనకువేలుముద్దులతో నింపేసింది. అప్పటినుంచీ సరిగ్గా మందులుత్రాగటం బలమైన ఆహారంతీసుకోటం మొదలుపెట్టి త్వరలో ఆరోగ్యంపొందింది ఎంతోకష్టపడి లీలకోసరం ఆహా! మాతృప్రేమ?